క్లుప్తంగా

వైఎస్సార్ పింఛన్ కానుక నిధుల విడుదల

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పింఛన్ కానుక నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ మొత్తం 18,120 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. పెనమలూరు మండలంలో 5,606 మంది లబ్ధిదారులకు రూ.1,55,15,750, తాడిగడప మున్సిపాలిటీలో 12,514 మందికి రూ.3,49,72,750 నగదు విడుదల చేసిందన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఆయా గ్రామాల్లో పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తామని చెప్పారు.

కొత్త పింఛన్ల మంజూరు..

ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో 426 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. వీటిలో పెనమలూరు మండలానికి 117 పింఛన్లు, తాడిగడప మున్సిపాలిటీలో 309 పింఛన్లు ఉన్నాయి.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



ఉయ్యూరు: పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులను తహసీల్దార్ మస్తాన్‌తో కలిసి కమిషనర్ వెంకటేశ్వరరావు గురువారం వెళ్లి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉయ్యూరు పట్టణంలో 37 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేంద్రాల్లో వసతులు, సౌకర్యాలు పరిశీలించి పూర్తి సమాచారంతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని చెప్పారు.

ఎలక్ట్రికల్ స్కూటర్‌లో బ్యాటరీలు చోరీ

పెనమలూరు: కానూరు కామయ్యతోపులో పార్కు చేసి ఉన్న ఎలక్ట్రికల్ స్కూటర్‌లో బ్యాటరీలు చోరీ జరిగిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాణిగారితోట చలసానినగర్‌కు చెందిన ఎం.ఫణికుమార్ కానూరు కామయ్యతోపులో ఉన్న మెడ్‌ప్లస్‌లో పని చేస్తాడు. అతను షాపు వద్దకు పనికి వచ్చి తన ఎలక్ట్రికల్ స్కూటర్‌ను షాపు బయట పార్కు చేశాడు. ఆ తరువాత వచ్చి చూడగా స్కూటర్‌లో ఉన్న రెండు బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. చోరీకి గురైన బ్యాటరీల విలువ రూ.98 వేలు ఉంటుందన్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

దోమల నిర్మూలనకు చర్యలు

కంకిపాడు: దోమల నిర్మూలన చర్యలు పటిష్టంగా చేపడుతున్నట్లు తెన్నేరు సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా చెప్పారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలు, పల్లపు ప్రదేశాల్లో దోమల నిర్మూలన మందు పిచికారీ పనులు గురువారం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పులూరి శాంతి, కార్యదర్శి సువర్ణలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కెనడీబాబు, ఏఎన్ఎం సుగుణ, సిబ్బంది పాల్గొన్నారు.

8న ఉచిత మెగా వైద్య శిబిరం

గన్నవరం: మండలంలోని గోపవరపుగూడెం ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఈ నెల 8వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ ఎ.రమేష్ పాల్ తెలిపారు. మండలంలోని అల్లాపురంలో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు



కంకిపాడు: మెరుగైన విద్యుత్ సరఫరాకు సమర్థంగా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్స్) పి.హరిబాబు అన్నారు. మండలంలోని మద్దూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి ప్రారంభించారు. హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొంటున్న లో ఓల్టేజీ సమస్య పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పరిష్కారమవుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ(ట్రాన్స్‌ఫార్మర్స్) రవికిషోర్, డీఈఈ ఎం.పూర్ణచంద్రరావు, ఏఈఈ టి.అశోక్‌కుమార్, మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరంకిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- సిబ్బందిని కేటాయించిన ప్రభుత్వం
- రూ.2.40 కోట్లతో త్వరలో భవన నిర్మాణం



పోరంకిలో ఆరోగ్య ఉపకేంద్ర భవనం

పెనమలూరు: పోరంకి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం త్వరలో అందుబాటులోనికి రానుంది. చాలా కాలంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కావాలని స్థానికులు ఎదురు చూస్తుండగా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సొంత భవనం నిర్మాణానికి రూ 2.40 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. సిబ్బందిని కూడా ఇటీవలె కేటాయించింది. పెనమలూరు మండలం 1985 సంవత్సరం ఏర్పడిన సమయంలో మండల జనాభా కేవలం 60 వేలు మాత్రమే ఉండేవారు. అయితే విజయవాడ నగర శివారులో పెనమలూరు మండలం ఉండి విస్తరించటంతో మండల జనాభా ఇప్పుడు 3 లక్షల వరకు చేరుకున్నారు. చాలా వరకు గ్రామాల్లో పేదలు ఉండటంతో వైద్య సేవలు కూడా బాగా పెరిగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు లోకి వచ్చిన తరువాత వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు కూడా ఏర్పాటు చేశారు. అయితే మండల జనాభా దామాషాగా పోరంకిలో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

పెనమలూరు అతి పెద్ద పీహెచ్‌సీ..

మండల కేంద్రంలో ఉన్న పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లాలోనే అతి పెద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉంది. మొత్తం 30 సచివాలయాలు, దాదాపు 30 ఆరోగ్య ఉప కేంద్రాలు పీహెచ్‌సీ కింద ఉన్నాయి. ఏడాదికి రూ.12 లక్షలు మందులకు బడ్జెట్ ఉంది. అయితే పెనమలూరు పీహెచ్‌సీ పరిధి చాలా పెద్దగా ఉండటం, వైద్యసేవలు మరింత విస్తృతం చేయటానికి ప్రభుత్వం కొత్తగా పోరంకిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుమతి ఇచ్చింది. మందుల బడ్జెట్ కూడా పెంచాల్సిన అవసరం ఏర్పడింది. నూతన భవన నిర్మాణానికి రూ.2.40 కోట్లు నిధులు కూడా కేటాయించింది. అనువైన స్థలం కోసం రెవెన్యూ అధికారులు వెతుకుతున్నారు. అప్పటి వరకు పోరంకిలో ఏదో ఒక ప్రభుత్వ భవనంలో పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభం చేయటానికి రంగం సిద్ధం చేశారు. త్వరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందించనున్నారు.

పోరంకి పీహెచ్‌సీకి సిబ్బంది కేటాయింపు..

రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలు విస్తృతం చేయటానికి పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని జీవో 143/32 కింద సర్దుబాటు చేసింది. ప్రతీ పీహెచ్‌సీకి 14 మంది సిబ్బంది కచ్చితంగా ఉంటారు. ఇద్దరు డాక్టర్లు, సీహెచ్‌ఓ, పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఎస్ మేయిల్, ఫిమేల్, స్టాఫ్ నర్సులు ముగ్గురు, ఫార్మసిస్ట్ గ్రేడ్ 2, గుమస్తా, ల్యాబ్‌టెక్నిషియన్, ఎఫ్ఎన్‌ఓ ఉంటారు. పోరంకిలో దాదాపుగా సిబ్బందిని నియమించారు. ఫార్మసిస్ట్, ల్యాబ్‌టెక్నిషియన్, గుమస్తా, ఎఫ్ఎన్‌ఓను నియమించాల్సి ఉంది. మిగితా సిబ్బంది ఇక్కడకు వచ్చారు.

త్వరలో ప్రారంభిస్తాం..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోరంకిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం త్వరలో ప్రారంభిస్తాం. సిబ్బంది నియామకాన్ని ఇప్పటికే ప్రభుత్వం చేపట్టింది. సొంత భవనం నిర్మించాల్సి ఉంది. అప్పటి వరకు తాత్కాలిక భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తాం.

– బిజిలీ శ్రీనివాస్,
మండల వైద్యాధికారి, పెనమలూరు

పిల్లల ఆరోగ్య వివరాలు తెలుసుకోండి

డీఎంహెచ్‌ఓ మాచర్ల సుహాసిని



అంగన్‌వాడీ కేంద్రం వద్ద సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె గురువారం రామవరప్పాడు సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, ఎత్తు, బరువుల నిర్వహణ, సామ్ మామ్ పిల్లల గుర్తింపు వంటి అంశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని పిల్లల స్థితిగతులను తెలుసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులు ఐరన్‌ఫోలిక్ యాస్ మాత్రలు సరఫరా, పంపిణీ వంటి అంశాలను పరిశీలించారు.

రంగన్నగూడెం దాడి ఘటనపై ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రంగన్నగూడెంలో దళితులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన టీడీపీ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు పలువురు దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నంలోని ఆయన కార్యాలయంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలిసి రంగన్నగూడెం దాడి ఘటనపై ఫిర్యాదు అందజేశారు. దాడి చేసిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను అరెస్ట్ చేయకుండా తాత్సారం చేయటాన్ని తప్పుబట్టారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మెండెం రాంబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఐనంపూడి ఆశీర్వాదం, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, లీగల్ సెల్ సభ్యుడు అరిగెల రాజా ఉన్నారు. అంతకుముందు రంగన్నగూడెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో రెండోరోజు దీక్ష నిర్వహించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. కానూరు వందడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతం రాజీవ్‌నగర్‌కు చెందిన వేముల విజయ్, రాము బైక్‌పై బుధవారం వణుకూరుకు మట్టి పనులకు వచ్చారు. వీరు పని ముగించుకుని ఇద్దరు బైక్‌పై ఇంటికి బయలుదేరారు. రాము బైక్ నడుపుతుండగా, విజయ్ వెనుక కూర్చున్నాడు. వీరు కానూరు వందడుగుల రోడ్డులోకి ప్రవేశించగానే వెనుక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న విజయ్ కాలుకు, చేతికి బలమైన గాయమైంది. బైక్ నడుపుతున్న రాములకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలుడికి గాయాలు

పెనమలూరు: యనమలకుదురు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు సాయినగర్ రెండో లైన్ పుట్టరోడ్డుకు చెందిన డి.దామోదర్ విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తాడు. కాగా అతని ఏడాదిన్నర కుమారుడు విక్రమ్ ఆదిత్య ఇంటి బయటకు వచ్చి రోడ్డు దాటుతుండా బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడి అపస్మారకస్థితిలో ఉన్న బాలుడిని విజయవాడలో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ ఘటనపై దామోదర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గన్నవరం సబ్‌జోన్ అధ్యక్షుడిగా బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. గన్నవరంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో గురువారం జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గన్నవరం సబ్‌జోన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గన్నవరం సబ్‌జోన్ ఉపాధ్యక్షుడిగా జీఎస్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా దనియాల నాగరాజు, మహిళా కార్యదర్శి కె.గీత, కోశాధికారిగా జి.రాంబాబు, గౌరవ అధ్యక్షుడిగా బీఎస్ రామచంద్రుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. నూతన కార్యవర్గానికి పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చెంచుల కాలనీలో పలువురికి అస్వస్థత

- తక్షణ చర్యలు చేపట్టిన పంచాయతీ, వైద్యశాఖ అధికారులు
- అదుపులోకి వచ్చిన పరిస్థితి



బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సర్పంచ్, ఈవో

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు చెంచుల కాలనీలో కొంతమంది అస్వస్థతకు గురైన సంఘటన గురువారం జరిగింది. వెంటనే అప్రమత్తమైన గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కాలనీలోని ఒకే కుటుంబానికి చెందిన ఇరువురు చిన్నారులు తేలికపాటి వాంతులు, జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. ఆశ వర్కర్ల సమాచారం మేరకు ముస్తాబాద వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు కాలనీకి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాలనీలో వైద్య సిబ్బంది చేపట్టిన ఇంటింటా సర్వేలో మరో 18 మంది వరకు జ్వరం, వాంతులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమానిక, ఈవో మానిక కాలనీకి చేరుకుని ప్రజల ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. డ్రైనేజీ సమస్య కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు స్థానికులు వాపోతున్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలిశెట్టి జయంతి రెండేళ్ల క్రితం భర్తతో విడిపోయి కుమారుడితో నున్న గ్రామంలో తల్లి వద్ద ఉంటోంది. బుధవారం అర్ధరాత్రి నవీన్ అనే వ్యక్తి బాత్‌రూమ్ నుంచి ఇంట్లోకి వచ్చి తన చెయ్యి పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫాతిమా మాత నవదిన ప్రార్థనలు ప్రారంభం



ఉంగుటూరు: తోటివారితో సోదర భావం కలిగి ఉండాలని పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు అన్నారు. మండల పరిధిలోని పెద అవుటపల్లి బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో ఫాతిమా మాత నవదిన ప్రార్థనలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన బుధవారం విజయవాడ మేత్రాసన పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ దివ్యపూజాబలిని సమర్పించారు. దేవుని కరుణ, మరియమాత దయను గురించి సందేశాన్ని బోధించారు. అనంతరం నవదిన ప్రార్థనల పతాకాన్ని దేవాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో విచారణ ఫాదర్ అభిలాష్, ఫాదర్లు ప్రవీణ్, కిషోర్, జయప్రసాద్, రవి, విచారణ పెద్దలు, మఠకన్యలు, కథోలిక విశ్వాసులు పాల్గొన్నారు.

నేత్రదానం సామాజిక కర్తవ్యం



కంకిపాడు: నేత్రదానం సామాజిక కర్తవ్యమని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో జాతీయ నేత్రదాన వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నేత్రదాన ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. డాక్టర్ సుందర్‌కుమార్ మాట్లాడుతూ.. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, హెల్త్ సూపర్‌వైజర్ సారమ్మ, హెల్త్ అసిస్టెంట్ కెనడీ బాబు, ఏఎన్ఎం భవాని, ఎఫ్ఎన్ఓ సాజిద, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం వరప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నర్సింగ్ విద్యార్థుల సాధికారత-సవాళ్లపై సదస్సు

గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ స్కూల్ అండ్ కళాశాలలో శుక్ర, శనివారాలలో 30వ రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ జె.వందన తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.బాబ్జీ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరవుతారని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు రాష్ట్రంలోని 53 నర్సింగ్ కళాశాలల నుంచి 1983 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. నర్సింగ్ విద్యార్థుల సాధికారత, అవకాశాలు, సవాళ్ల అంశంపై సదస్సు చర్చిస్తుందని, ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ శాఖ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితాలో తొలగించిన, కొత్తగా నమోదు చేసిన ఓటర్లతోపాటు మార్పు చేర్పులను నిశితంగా పరిశీలించి పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. గురువారం సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని మాచవరం, భవానీపురంలో ఓటర్ల జాబితాను కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. కుమ్మరిపాలెంలోని జొన్నవిత్తుల వారి వీధి, భవానీపురంలోని మాదాల వారి వీధిలో నివసిస్తున్నోటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి జాబితాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా ప్రకారం 16 లక్షల 670 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. నమోదైన ఓటర్ల జాబితాను బీఎల్వోలు పరిశీలించారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్వోలు కనీసం 1000, స్పెషల్ ఆఫీసర్ 500, కలెక్టర్ హోదాలో జిల్లా ఎన్నికల అధికారి కనీసం 100 ఓట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి ర్యాండమ్ చెక్ చేయాలన్నారు. సెప్టెంబర్ 7వ తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి 8వ తేదీన ఎన్నికల సంఘానికి నివేదికను సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయభాస్కర్‌రావు, సహాయ రిటర్నింగ్ అధికారి డి. వెంకటలక్ష్మి, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ దరియా, సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, బీఎల్వోలు వనిత, రాజశేఖర్‌బాబు, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

నున్న జెడ్పీ హైస్కూల్లో వసతుల పరిశీలన



నున్న హైస్కూల్ ను సందర్శించిన ఎన్ఐడీఎం బృందం

నున్న(విజయవాడరూరల్): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడీఎం) బృందం గురువారం నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించింది. కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళా పోలీసుల(మహిళా సంరక్షణ కార్యదర్శులకు) శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ సేఫ్టీ అనే అంశంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి 60 మంది శిక్షకులు ఉన్నారు. 9,10 తరగతుల విద్యార్థులను వారు కలిసి అక్కడ వున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణ, తాగునీరు, శానిటేషన్, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల మానసిక స్థితిగతులను వారు పరిశీలించారు. తరగతి గదుల సేఫ్టీని పరిశీలించారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ లో మౌలిక సదుపాయాలను పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ బృందంలో క్యాంపస్ మేనేజర్ బీరేంద్రసింగ్, సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కుమార్ రాకా, జూనియర్ కన్సల్‌టెంట్ నజియా, డాక్టర్ బాలు.ఐ, రంజన్ కుమార్, షాహీన అన్సారీ తదితరులున్నారు. హైస్కూల్‌కు సంబంధించిన వివరాలను హెచ్ఎం భూపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా శ్రీవిఖనస మహర్షి జయంతి వేడుకలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

గన్నవరం: దావాజిగూడెంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవిఖనస మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం విఖనస మహర్షికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం పంచామృతాలతో స్నపన తిరుమంజనం, 1,108 తామర పుష్పాలతో మహర్షికి అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. స్వామి వారికి జరిపిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన వైఖానస స్వాములు పాల్గొన్నారు.

ఆప్యాయత, అనురాగాలతో రక్షా బంధన్



రక్షాబంధన్ కడుతున్న బాలికలు



ఉయ్యూరులో వినూత్నంగా చెట్టుకు రాఖీ కడుతున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఉయ్యూరు: రాఖీ పండుగను ప్రేమానురాగాలతో జరుపుకున్నారు. అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఆప్యాయత, అనురాగాలతో, సంతోషంగా వేడుకలను నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో వినూత్నంగా చెట్లకు రాఖీ కట్టి మొక్కలను ప్రేమించాలనే సందేశాన్ని చాటారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

గన్నవరం: రాఖీ పౌర్ణమి వేడుకలను గన్నవరం ప్రాంతంలో గురువారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక ప్రజ్ఞ స్కూల్ విద్యార్థినులు స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల విద్యార్థులకు, స్పందన మానసిక వికాస కేంద్రంలో దివ్యాంగులకు, సీఆర్పీఎఫ్ జవాన్లకు, ఎంపీపీ అనగాని రవి, ఎంపీడీఓ సత్యకుమార్‌కు రాఖీలు కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల డైరెక్టర్ పవన్ కుమార్, కరస్పాండెంట్ రంజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ శైలజ రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మల్లవల్లి ఎంపీపీ స్కూల్‌లో...

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థుల్లో నైతిక విలువలు, సోదర భావం పెంపొందించేందుకు 'రక్షాబంధన్' వంటి పండుగలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈవో-2 బి.సురేష్ కుమార్ చెప్పారు. బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఎంపీపీ స్కూల్ (మెయిన్)లో సామాజిక రక్షాబంధన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో బాలురకు బాలికలతో రక్షాబంధన్ కట్టించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో-2 సురేష్‌కుమార్ మాట్లాడుతూ రక్షాబంధన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కుటుంబ బాంధవ్యాల పటిష్టత, పెద్దల పట్ల గౌరవం, సామాజిక కుటుంబ వ్యవస్థ బలోపేతం కోసం బాల్యం నుంచే పాఠశాలలో ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం కె.శివనాగకృష్ణ తెలిపారు.

యనమలకుదురులో అమ్మవారికి గాజుల అలంకరణ



గాజుల అలంకరణలో శ్రీ పార్వతీదేవి అమ్మవారు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, భక్తుల సహకారంతో శ్రీ పార్వతీదేవి అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు జీవీఆర్ సాగర్, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చండీ హోమం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు పాల్గొన్నారు. శ్రీరామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం శ్రీ పార్వతీదేవి అమ్మవారికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు పేరంటాలమ్మకు గాజుల అలంకరణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవార్లను గాజులతో అలంకరించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. శ్రావణ మాసం పురస్కరించుకుని పేరంటాలమ్మను భక్తులు సమర్పించిన గాజులతో అలంకరిస్తామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని మహిళా భక్తులు ఈ అలంకరణ నిమిత్తం గాజులు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బోధన

రామవరప్పాడు: మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతకు తగ్గట్టుగా విద్యా బోధన చేయాలని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు అధ్యాపకులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'నేషనల్ ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'పై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులను పరిపూర్ణులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. అధ్యాపకులు కూడా నిరంతర విద్యార్థులేనని ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా తమను తాము మార్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన క్లౌడ్ డెవలప్స్ ఇంజినీర్ ఎం.రమేష్ నిరంతర అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలు, కాన్ఫిగరేషన్ మేనేజ్‌మెంట్, ఆటోమేషన్ అంశాలపై అవగాహన కల్పించారు. ఏడబ్ల్యూఎస్ ఈసీ2 సర్వీస్, బేసిక్ కమాండ్స్, గిట్ యుజెస్, జెన్‌కిన్ ఫ్రీ స్టయిల్ ప్రాజెక్ట్, పైప్‌లైన్ ప్రాజెక్టు గురించి చర్చించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బి.ఆశాలత, అధ్యాపకులు పాల్గొన్నారు.